తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
09 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 300
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# ప్రజలకు అందుబాటులోకి ఎంసీఆర్ టిమ్స్

- మిగిలిన పనులు వేగంగా పూర్తి
- సూపర్ స్పెషాలిటీ సేవల లక్ష్యం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు సిద్ధమవుతున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (ఎంసీఆర్ టిమ్స్) ప్రారంభానికి రంగం సిద్ధమవుతోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ఆసుపత్రిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రిని త్వరలోనే ప్రజలకు అంకితం చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభానికి ముందు అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఏ, బీ, సీ బ్లాకులను సందర్శించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, రోగులకు కల్పించనున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు, సిబ్బందితో మాట్లాడి అందుబాటు లో ఉన్న సౌకర్యాలు, అవసరమైన ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి ప్రారంభమైన మొదటి రోజు నుంచే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా, నీటి వసతి, పారిశుధ్యం, భద్రత, అగ్నిమాపక వ్యవస్థలు, అత్యవసర సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలోని ప్రతి విభాగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వైద్య సేవల నిర్వహణకు అవసరమైన మానవ వనరుల కల్పనపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు, పరిపాలనా సిబ్బంది తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు వైద్య సేవలతో పాటు అవసరమైన ఇతర సహాయక సేవలు కూడా నిరంతరాయంగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

ఎంసీఆర్ టిమ్స్‌ను

మిగతా 2వ పేజిలో..






# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

- 15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం

నిజామాబాద్,ఆగస్ట్8 (తరంగాలు ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో

మిగతా 2వ పేజిలో..



# ఉద్యోగాలు అడిగితే లాఠీలేనా..?

- నిరుద్యోగ యువతపై పోలీసుల లాఠీఛార్జ్ దారుణం
- కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని ఖండిస్తున్నాం
- హైడ్రాలో 150 ఉద్యోగ ఖాళీల కోసం వేలాది మంది యువత తరలివచ్చారు
- రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు ఈ ఘటన నిదర్శనం
- ఏ యువత ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చారో.. అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ అంధకారంలోకి నెట్టివేస్తోంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు

2వ పేజిలో..



# పెద్ది కుటుంబానికి "కేసీఆర్ భరోసా"

- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం..
- ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి...తల్లి అమృతమ్మ సంక్షేమానికి రూ.25 లక్షలు
- కుటుంబ భవిష్యత్తుకు అండగా బీఆర్ఎస్

హైదరాబాద్, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి): స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అండగా నిలిచింది. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు సుదర్శన్ రెడ్డి కుటుంబానికి

మిగతా 2వ పేజిలో..

# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపు
- టీడీపీ శిక్షణా తరగతుల్లో చంద్రబాబు సూచనలు
- పార్టీ క్రమశిక్షణకు పెద్దపీట



మంగళగిరి, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి): ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాలను సమర్థంగా ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌చార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరైన ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, భావజాలాన్ని పూర్తిగా అర్థం చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం

మిగతా 2వ పేజిలో..

# కొత్తదనం నేర్చుకునే వారిదే "భవిష్యత్ విజయం"

- ఇతరులతో కాదు.. మీతో మీరే పోటీ పడండి!
- జీవితానికి సిలబస్ ఉండదు.. సవాళ్లే పాఠాలు!
- కుతూహలం, సృజనాత్మకతతో ముందుకు సాగాలి
- యువత దేశాభివృద్ధికి చోదకశక్తి కావాలి
- ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ దిశా నిర్దేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి): సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసు కుంటున్న నేపథ్యంలో కొత్త విషయాలను నిరంతరం నేర్చుకునే వారే భవిష్యత్తులో విజేతలుగా నిలుస్తారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. యువత తమ ప్రతిభ, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోదీ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేసి భవిష్యత్తు ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి మూడు వేల మందికిపైగా విద్యార్థులు హాజరుకాగా, 587 మంది పీహెచ్‌డీ పరిశోధకులు ఉన్నారు.



## 'పరం ప్రాగ్యా' సూపర్ కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం

ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రాగ్యా' అత్యాధునిక కృత్రిమ మేధ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని

మిగతా 2వ పేజిలో..




# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

- ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రైతాంగ సమస్యలు, సాగునీటిపై ఆందోళన
- తెలంగాణ ఉద్యమ తరహాలో మరో పోరాటానికి పిలుపు

2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 09 ఆగస్టు, 2026


# ఉద్యోగాలు అడిగితే లాఠీలేనా..?

హైదరాబాద్, ఆగస్టు 8(తరంగాలు ప్రతినిధి):,సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్రంగా బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటూ గొప్పలు చెబుతుంటే.. తెలంగాణలో మాత్రం ఉపాధి కోసం వచ్చిన యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని రామచందర్ రావు విమర్శించారు.

హైడ్రాలో కేవలం 150 ఉద్యోగ ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనమని అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని ఆరోపించారు.అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని రామచందర్ రావు గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు.హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలు చేసి, ఉద్యోగాలపై ఆశతో వచ్చిన నిరుద్యోగులపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమన్నారు."ఏ యువత ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చారో.. అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేస్తోంది" అని ఆరోపించారు.ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని ఎన్. రామచందర్ రావు డిమాండ్ చేశారు.

## పెద్ది కుటుంబానికి "కేసీఆర్ భరోసా"

మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.1 కోటి చొప్పున రూ.2 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. వారి విద్యాభ్యాసం, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్తు అవసరాలకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.అదేవిధంగా సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను బ్యాంకులో జమ చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, పిల్లల చదువు, ఉన్నత విద్య, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ సహాయం ఉద్దేశమని పేర్కొన్నారు.కుటుంబ సభ్యులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు బీఆర్ఎస్ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఆర్థిక సహాయంతో పాటు నైతికంగా కూడా కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

సుదర్శన్ రెడ్డి కుటుంబం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కేసీఆర్ అందించిన ఆర్థిక సహాయం వారికి గొప్ప ఊరటనిచ్చిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు, కుటుంబ సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఈ సహాయం అందించినట్లు తెలిపారు.కుటుంబానికి అవసరమైన సహకారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం అందించాలని బీఆర్ఎస్ నాయకత్వం సూచించింది.

## 10న కలిదిండికి సీఎం చంద్రబాబు రాక

- **రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం**

అమరావతి,ఆగస్ట్8 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 10న ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు ప్రజా వేదిక, క్యాడర్ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు ఉదయం 10:45 గంటలకి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు చేరుకుంటారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకుంటారు. 11 గంటల నుంచి 11:45 వరకు రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారాల దిశగా చర్యలు చేపడతారు. ఆ తర్వాత కలిదిండిలో ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించనున్నారు. ఉదయం 11:55 నుంచి మధ్యాహ్నం 2:05 వరకు ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారు. 2:55 నుంచి సాయంత్రం 4:25 వరకు క్యాడర్ సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశర చేయనున్నారు. సాయంత్రం 4:35 గంటలకు కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం 4:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4:55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

## 17 నుంచి ఏపి శాసనభ సమావేశాలు

అమరావతి,ఆగస్ట్8 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.

## మహిళా ఎస్ఐపై దాడి కేసు

- **వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అరెస్ట్**

శ్రీకాకుళం,ఆగస్ట్8 శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ను ఏపీ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చిలకపాలెం వద్ద రవిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై దాడి కేసులో అతను ఏ-1గా ఉన్నారు. పది రోజులుగా పోలీసులు కళ్లుగప్పి రవి తిరుగుతున్నాడు. గత నెల 30వ తేదీన మాజీమంత్రి అప్పలరాజు ములాఖత్ కోసం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా భారీగా కార్యకర్తలతో జగన్‌కు స్వాగతం పాలకటానికి చింతాడ రవి వచ్చాడు. కొట్టూరోడ్డు వద్ద బందోబస్తులో ఉన్న మహిళా ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించటంతో పాటు అసభ్యంగా రవి, అతని అనుచరులు వ్యవహరించారు. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది.

# కొత్తదనం నేర్చుకునే వారిదే "భవిష్యత్ విజయం"




ప్రారంభించారు. అధునాతన కంప్యూటింగ్, కృత్రిమ మేధ, పరిశోధన రంగాలకు ఈ కేంద్రం మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో మరింత కీలక పాత్ర పోషించేందుకు ఇలాంటి అత్యాధునిక వసతులు దోహదపడతాయని అన్నారు.

### 20--30 ఏళ్లలో ప్రపంచంలో పెను మార్పులు

రాబోయే 20 నుంచి 30 సంవత్సరాల్లో ప్రపంచం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని మోదీ పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత, డ్రోన్లు, క్వాంటం కంప్యూటింగ్, డేటా కేంద్రాలు, విద్యుత్ వాహనాలు, శక్తి నిల్వ వ్యవస్థలు వంటి రంగాల్లో యువతకు అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు.

ఐఐటీ విద్య ద్వారా సంక్లిష్ట సమస్యలను పరిష్కరించే సామర్థ్యంతో పాటు విలువైన అనుభవం, ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలను విద్యార్థులు సంపాదించారని ప్రధాని అన్నారు.

### జీవితానికి సిలబస్ ఉండదు

విశ్వవిద్యాలయ జీవితానికి, వాస్తవ జీవితానికి తేడా ఉంటుందని మోదీ వివరించారు. విద్యా సంస్థల్లో సిలబస్ ఉంటుందని, కానీ జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు ముందస్తు పాఠ్యాంశాలు ఉండవని అన్నారు. కుతూహలం, సృజనాత్మకత, సమస్యలను అవకాశాలుగా మార్చే ధైర్యం యువతలో ఉండాలని సూచించారు.

### ఇతరులతో కాదు.. మీతో మీరే పోటీ పడండి

జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, గుర్తింపు వంటి అంశాల్లో సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనుకావద్దని విద్యార్థులకు ప్రధాని సూచించారు. జీవితం ఒక పోటీ పట్టిక కాదని, ఇతరులతో పోల్చుకోవడం కంటే తమతో తామే పోటీ పడుతూ వ్యక్తిగత అభివృద్ధి సాధించాలని అన్నారు.పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ దేశ పురోగతికి యువత తమ వంతు సహకారం అందించాలని, నిరంతర అధ్యయనం, వ్యక్తిగత అభివృద్ధి, దేశ ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు.

## ప్రజలకు అందుబాటులోకి ఎంసీఆర్ టిమ్స్

రాష్ట్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ప్రముఖ ప్రభుత్వ వైద్య సంస్థగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్, అవయవ మార్పిడి చికిత్సలు, ప్రత్యేక వైద్య విభాగాలు, ఆధునిక పరికరాలతో కూడిన చికిత్సా సేవలు ఒకే వేదికపై అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నామని వివరించారు. దీనివల్ల ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఎంసీఆర్ టిమ్స్ కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని ఇతర ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు సూపర్ స్పెషాలిటీ చికిత్స అవసరమైన వేలాది మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. ప్రారంభం నుంచే అత్యుత్తమ సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# నిజలింగప్పకు సీఎం నివాళులు

- **విధానసౌధ వద్ద పుష్పాంజలి**
- **కర్ణాటక తొలి ముఖ్యమంత్రిని స్మరించిన డీకే శివకుమార్**
- **ప్రజాకేంద్ర పాలనకు ఆదర్శమని కొనియాడిన సీఎం**

బెంగళూరు, ఆగస్టు 8 ఏకీకృత కర్ణాటక తొలి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎస్. నిజలింగప్ప జయంతి సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆయనకు ఘన నివాళులర్పించారు. విధానసౌధ పశ్చిమ ద్వారం సమీపంలోని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నిజలింగప్ప కర్ణాటక ఏకీకరణ, పరిపాలనా సంస్కరణలు, విద్యాభివృద్ధి, రాష్ట్ర సమగ్ర ప్రగతికి చేసిన సేవలను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆయన దూరదృష్టి, ప్రజాసేవా దృక్పథం, విలువలతో కూడిన రాజకీయాలు నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ప్రజాకేంద్ర పాలనకు నిజలింగప్ప చూపిన మార్గం అన్ని తరాల నాయకులకు ఆదర్శమని డీకే శివకుమార్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామలింగారెడ్డి, ఈశ్వర్ ఖండ్రేతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని నిజలింగప్పకు ఘన నివాళులు అర్పించారు.

# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు.ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు తెలియజేయకపోతే తప్పుడు ప్రచారాన్ని నమ్మే పరిస్థితులు ఏర్పడతాయని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ఆరోపణలు, కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజల ముందే ఖండించాలని సూచించారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో కూడా తప్పుడు ప్రచారం జరిగిందని, అయితే ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందు ఉంచి దానికి సమాధానం చెప్పగలిగిందని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, ఎలాంటి తప్పిదాలు లేవని ప్రభుత్వం స్పష్టం చేయడంతో అనేక మంది కూడా అదే విషయాన్ని అంగీకరిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులే ఇప్పుడు తప్పుడు ప్రచారాలను వ్యతిరేకిస్తూ ముందుకు వస్తున్నారని అన్నారు. ప్రజల ముందు నిజాలు ఉంచితే అసత్యాలు నిలవవని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రాజెక్టులకు ప్రజల నుంచి లభిస్తున్న సహకారం ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతోందని వివరించారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ కార్యకర్త నుంచి అగ్రనేత వరకు అందరికీ పార్టీనే సర్వోన్నతమని పేర్కొన్నారు. కార్యకర్తలను నిర్లక్ష్యం చేసే వారిపైనా, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపైనా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి బూత్‌లో గతం కంటే ఎక్కువ ఓట్లు సాధించే లక్ష్యంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

హైదరాబాద్, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి):రాష్ట్ర ప్రయోజనాలు, ముఖ్యం గా తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీ పడదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, రైతాంగ సమస్యల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన యాగాలపై జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, దేశంలో కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేసి ఉండరని కేటీఆర్ అన్నారు. యాగాలు, పూజలు అనేవి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాలని, వాటిని రాజకీయ విమర్శల కోసం ఉపయోగించడం తగదన్నారు. దైవబలం కావాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, ప్రజల కోసం పనిచేసే సంకల్పంతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా సమాజంలో భాగమేనని పేర్కొన్నారు. యాగాలు నిర్వహించినందుకు విమర్శించడం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు దేవాలయాలను సందర్శించడం, పూజలు చేయడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చి విమర్శించడం దురదృష్టకరమన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, మతపరమైన కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఇలాంటి అంశాలపై రాజకీయ విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల అసహనాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేదని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంతానికి సాగునీరు అందించే విషయంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతులకు నీటి అందుబాటు, పంటల రక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు.

రాష్ట్ర నీటి హక్కుల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే అత్యంత ఆందోళన కలిగించే అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. గోదావరి నదీ నిర్వహణ బోర్డు సమావేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేటాయించిన నీటి వాటాను రక్షించేందుకు ప్రభుత్వం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి హక్కులు అనేవి కేవలం రాజకీయ అంశం కాదని, కోట్లాది మంది రైతుల జీవనాధారానికి సంబంధించిన కీలక అంశమని గుర్తుచేశారు. విద్యుత్ సరఫరాపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అది నిజమైతే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ప్రజలకు అందుతున్న సేవల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ప్రచారాల కంటే ప్రజల అనుభవాలే నిజమైన ప్రమాణమని వ్యాఖ్యానించారు.

'హైడ్రా' పేరుతో పేదలపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రజల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, బలహీన వర్గాలపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జరగాలని, పేదల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ శ్రేయస్సే తమ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, నీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే తెలంగాణ ఉద్యమ తరహాలో మరో భారీ ప్రజా పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలను చైతన్యపరిచి, రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల పక్షాన నిలుస్తామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు



అవసరమైన పుస్తకాలను ఉచితంగా అందజేసింది. విద్యార్థి చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు యాజమాన్యం గొడిశాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సాధారణంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు, పుస్తకాలు, ఇతర విద్యా ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో.. ఓ నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం అభినందనీయమని పలువురు గ్రామస్తులు ప్రశంసించారు. విద్యను వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా కాకతీయ స్కూల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం ఇతర విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. నిరుపేద విద్యార్థి చదువుకు అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్న కాకతీయ స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

- మానవత్వం చాటుకున్న కాకతీయ స్కూల్ యాజమాన్యం

**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 8, తరంగాలు** : ప్రైవేట్ పాఠశాలలు అంటే అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం తదితర ఖర్చులతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతాయనే అభిప్రాయం సాధారణంగా ఉంది. అయితే అందుకు భిన్నంగా ఓ నిరుపేద విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించి కాకతీయ స్కూల్ యాజమాన్యం మానవత్వాన్ని చాటుకుంది. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు అవసరమైన పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయలేని విద్యార్థి పరిస్థితిని గుర్తించిన పాఠశాల యాజమాన్యం వెంటనే స్పందించి, విద్యార్థికి



# ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






**నల్గొండ, ఆగస్టు8,తరంగాలు** :
ఎల్ నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుండి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయకుండా ఆరు తడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందు కష్ట కాలంలో అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉందని, శ్రీశైలం నుండి నీరు వచ్చినప్పటికి పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు .ఏ ఎం ఆర్ పి కూడా సగమే నిండిందని ,గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి లేదని, రాబోయే రోజుల్లో సూపర్ ఎల్ నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడి లో భాగంగా 33 వేల ఎకరాలలో వరికి వదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని ,అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరు తడి పంటలు వేయించాలన్నారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్ఫార్మర్ల పై ఉన్న ఓవర్ లోడ్ ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామాగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినప్పటికి నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని, ఎఎం ఆర్పీ, ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లెముల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, కరువు వచ్చినా సరే శ్రీశైలం డెడ్ స్టోరేజ్ లో ఉన్నప్పటికీ ఎస్ఎల్బీసీ నుండి సాగునీరు అందించవచ్చన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్ట కాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని,దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకు పనికిరాకుండా పోతాయని, విపరీతంగా ఎరువులు వాడడం, నిరంతరం వరి సాగు చేయటం వల్ల భవిష్యత్ లో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల వర్షాలు లేనందున ప్రాజెక్టుల్లో కూడా సరైనంత నీరు లేదని, రానున్న రోజుల్లో పై నుండి సాగునీరు వచ్చే అవకాశాలు లేవని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో రైతులు వేసుకోబోయే పంటలు, తాగునీరు, ఇతర సౌకర్యాలపై చర్చించి ప్రణాళిక రూపొందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ లో కూడా సూపర్ ఎల్ నినో ప్రభావం ఉంటుందని ఉత్తర తెలంగాణకు మాత్రమే అక్కడక్కడ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాకు వర్షాలు లేవన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ,రైతులు పంటల మార్పిడిలో భాగంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఆగస్టు 15 వరకు మాత్రమే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యం చేయాలని కోరారు . మున్సిపాలిటీలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ను ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు.

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,హాలియా ,నిడమనూరు పిఏ సి ఎస్ అధ్యక్షులు, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు హాజరయ్యారు కాగా ప్రాజెక్టులు, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, విద్యుత్ అధికారులు డిఆర్డిఓ ప్రస్తుతం సాగునీటి పరిస్థితి, పంటలు, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ పై సమావేశానికి వివరించారు. జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

# ఇంకెంతకాలం ఎదురుచూపులు

- నిజమైన ఉద్యమకారులను గుర్తించడంలో ఆలస్యం ఎందుకు
- సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 8 తరంగాలు** వలిగొండ తెలంగాణఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కేకే కమిటీ కాలయాపన కోసమేనా అనే అనుమానం కలుగుతుందని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు. ఉద్యమకారులు తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడరు అని,అలాంటి ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి కాలయాపన చేయకుండా ఉద్యమకారుల ఆశలు అడియాసలు కాకుండా ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉన్నందున వెంటనే ఉద్యమకారులకు సముచితమైన గౌరవం దక్కాలని ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని,కేకే కమిటీ ఉద్యమకారులకు అందని ద్రాక్ష లాగా మారిందని ఉద్యమకారులు లేకుండా ప్రభుత్వం ఎక్కడిదని మీకు భోగభాగ్యాలు ఎక్కడివని ఆయన ప్రశ్నించారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు నాన్చుతుందో అర్థం కావడం లేదన్నారు. త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో కొంతమేర రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారుల ఆశలను చిగురింపజేశాయని,కానీ నాన్చుడు ధరణి మంచిది కాదని ఇప్పటికి అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని,ఎప్పుడు ఉంటారో ఎప్పుడు పోతారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే ప్రత్యేక వెబ్సైటు ఓపెన్ చేయాలని లేదా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవానికి యువ కార్యకర్తలు కదలి రావాలి

- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : జాతీయ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 9వ తేదీ ఉదయం 9:00 గంటలకు సంజీవరెడ్డి భవన్--డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యువతలో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, దేశ సేవా భావాలను మరింతగా పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధికి

# కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- రూ.1.83 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- నిధులు కోరితే వెంటనే మంజూరు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 8,తరంగాలు** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మ రాజరాజేశ్వర కాలనీలో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, రూ.63 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అదేవిధంగా శ్రీనివాస్ నగర్ కాలనీలో రూ.30 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. మొత్తంగా రూ.1.83 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు ఆయన తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని శ్రీశైలం గౌడ్ అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు కోరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ముత్యం రెడ్డి, యాదవ రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సదానందం, తిరుపతి రెడ్డి, స్థానిక కాలనీల అధ్యక్షులు రాజిరెడ్డి, మోహన్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిరిసిల్ల నేతన్నల కోసం 'ఏఐ అండ్ డిజిటల్ టూల్స్' శిక్షణ



- కేటీఆర్ 'గిఫ్ట్ ఏ స్మైల్' చొరవలో భాగంగా టీఎంఎస్ ఎన్జీవో ప్రతిపాదన
- నైపుణ్యం నేర్చుకోండి... అవకాశాలను అందిపుచ్చుకోండి.. భవిష్యత్తును నిర్మించుకోండి!
- పిలుపునిచ్చిన సంస్థ వ్యవస్థాపకురాలు దోనికేన పద్మ

**హైదరాబాద్, ఆగస్టు 8,తరంగాలు :** నేతన్నల కుటుంబాలు, యువత, మహిళా గార్మెంట్ కార్మికులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ మహిళా సంఘం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.కేటీఆర్ 'గిఫ్ట్ ఏ స్మైల్ ' చొరవలో భాగంగా నెల రోజుల పాటు శని, ఆదివారాల్లో 100 శాతం ఉచితంగా 'ఏఐ అండ్ డిజిటల్ టూల్స్' పై ప్రాక్టికల్ శిక్షణ అందించేందుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దోనికేన పద్మ తెలిపారు.ఈ శిక్షణ ద్వారా నేతన్నలు, మహిళా కార్మికులు స్మార్ట్‌ఫోన్ ద్వారానే ఆధునిక ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించనున్నారు. ఏఐ ఆధారిత సాధనాలతో మోడల్స్, స్టూడియోల అవసరం లేకుండా చీరల ఫోటోషూట్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవడం, కాన్వా ఏఐ వంటి టూల్స్ సహాయంతో కొత్త చీరల డిజైన్లను రూపొందించడం, చాట్ జీపీటీ వంటి సాధనాల ద్వారా భాషా సమస్యలను అధిగమించి ఇతర రాష్ట్రాల వినియోగదారులతో వ్యాపార సంబంధాలు మెరుగుపరుచుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు.నేతన్నల రోజువారీ ఉపాధికి ఎలాంటి అంతరాయం కలగకుండా శని, ఆదివారాల్లో మాత్రమే తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు పద్మ పేర్కొన్నారు.పటన్ చెరు సిరిసిల్ల, వరంగల్,లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్థానిక అధికారుల సహకారంతో పాటు చేనేత సంఘాల భవనాల్లో శిక్షణ తరగతులకు అవకాశం కల్పించాలని కేటీఆర్ కార్యాలయాన్ని కోరినట్లు తెలిపారు.అదే విధంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి భవిష్యత్తులో గ్లోబల్ ఐటీరంగం అవకాశాలు అందిపుచ్చుకునేలా కీర్తిని లక్ష్యంతో టీఎంఎస్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం పూర్తిగా ఉచితంగా ఉంటుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'సాంకేతికతను నేతన్నల చేతుల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం'

ఏఐ , డిజిటల్ టెక్నాలజీని కేవలం నగరాలకే పరిమితం చేయకుండా సిరిసిల్ల నేతన్నల కుటుంబాలకు చేరువ చేయడం ద్వారా వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించవచ్చని తెలంగాణ మహిళా సంఘం చైర్మన్ దొనికెన పద్మ తెలిపారు.




# ఘనంగా బీర్ల అనితమ్మ జన్మదిన వేడుకలు





**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 8 తరంగాలు** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారి సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత జన్మదిన వేడుకలు అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని అధికారిక నివాసంలో సప్త శనివార వ్రతం మహోత్సవాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి బీర్ల అనిత గారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులందరి శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.అనంతరం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని బీర్ల అనిత కి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీర్ల అనిత ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్‌కు తరలివచ్చి అభిమానులు, కార్యకర్తలు ఆత్మీయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

# మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 8,తరంగాలు :** మృతుని కుటుంబానికి అండగా ఉంటామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.శనివారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన పైండ్ల కుమారస్వామి శుక్రవారం అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.నిరుపేద కుటుంబానికి చెందిన కుమారస్వామి భార్యకి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న గౌడ్ ,ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, వర్ధన్నపేట సొసైటీ చైర్మన్ కొడగాని రాజేష్ ఖన్నా, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎద్దు సత్య నారాయణ ,నల్లబెల్లి మాజీ గ్రామశాఖ అధ్యక్షులు దిలీప్,సీనియర్ నాయకులు బిర్రు రాజు,సాయికుమార్, తుల్ల రవి,చెక్కి గోపాల్,మండల,గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మూడు చేపల కథ' లఘు చిత్రానికి క్లాప్ కొట్టి ప్రారంభించిన భూక్యా సురేష్ నాయక్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** అంబటి సిద్ధార్థ దర్శకత్వంలో, వెంకీ, కిరణ్, సిద్దు హీరోలుగా, సాయి ఫణీంద్ర ఫోటోగ్రఫీతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో తెరకెక్కుతున్న 'మూడు చేపల కథ' లఘు చిత్ర షూటింగ్‌ను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులకు అభినందనలు తెలిపారు. లఘు చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందడంతో పాటు, చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ మంచి పేరు, గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరికీ మరిన్ని మంచి అవకాశాలు రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 8 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన బత్తిని అంజమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందగా పాదివదేహానికి పూలమాలయం అర్పించారు అనంతరం వారి కుటుంబానికి అండదండగా ఉంటానని రూ.5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వాకిటి అనంత రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల స్వామి,కోడితల కరుణాకర్,దామెర ఎలిమినేటి పెంటయ్య వార్డ్ మెంబర్లు రేఖ మచ్చగిరి,వేముల అనిల్ కుమార్,క్యాదరి మనీషా నరేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్ర సాయి, సోషల్ మీడియా కన్వీనర్ బుర్ర శ్రీకర్,మర్రి ముత్యాలు,జీనుకాల మల్లయ్య,ఆకుల మచ్చి, మాటూరి సాయి గ్రామస్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగులకు పండ్ల పంపిణీ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 8 తరంగాలు** వలిగొండ మండల పరిధిలోని టేకులసోమారం గ్రామంలోని సాధన దివ్యాంగుల సేవా సంస్థ నందు ఇటీవల అకాల మరణం చెందిన పరాంకుశం యశ్వంత్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు పరాంకుశం స్వాతి రఘు నారాయణ దంపతులు దివ్యాంగులకు పండ్ల పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామన్నపేట సెకండ్ క్లాస్ కోర్ట్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాన్ని యశ్వంత్ తల్లిదండ్రులు నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పరాశీకుశం కౌసల్య కృష్ణస్వామి,పరాశీకుశం షణ్ముఖ స్వామి,పరాశీకుశం వెంకన్న, టిఎస్ఆర్టీసీ మెకానిక్ బుంగమట్ల కిష్టయ్య మరియు సంస్థ నిర్వాహకులు సురేఖారెడ్డి,మధుసూదన్ రెడ్డి,జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రత్న విద్యాలయంలో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

**సంగెం ఆగస్టు 8 తరంగాలు** మండలంలోని మొండ్రాయి గ్రామంలో గల శ్రీ రత్న విద్యాలయంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే పోచమ్మ బోనాల పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ రత్న విద్యాలయం లో నిర్వహించారు. విద్యార్థులకు మన పూర్వీకుల ఆచారాలను పండుగ విశిష్టతను తెలియజేయడం ముఖ్య ఉద్దేశంతో ఈ పండుగ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చిక వెంకటేశ్వర ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పాఠశాల కరస్పాండెంట్ మచ్చిక శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పోతురాజు వేషధారణలో దేవులపల్లి హేమంత్, ఇంతల ప్రేమ్ సాయి అలరించారు. 7వ తరగతి, 5వ తరగతి విద్యార్థినులు పోచమ్మ బోనాలను నెత్తిన పెట్టుకుని, బోనాలను పూజించి, చేతుల్లో వేపకొమ్మలు పట్టుకుని బోనాల పండుగ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వేడుకల్లో పాల్గొన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, పోచమ్మ బోనాల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల సంప్రదాయ వేషధారణ, బోనాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చిక వెంకటేశ్వర మాట్లాడుతూ.. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వనజ, ఉపాధ్యాయునిలు మంజుల, సునీత, మౌనిక, రమ్యశ్రీ, సంధ్య, ప్రవళిక, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..



THARANGALU DAILY NEWS
ఆదివారం, 09 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# వర్గీకరణ వద్దు రోస్టర్ విధానం వద్దు





- జీఓ 29ను వెంటనే రద్దు చేయాలి -- నల్గొండలో మాలల మహాధర్నా
- రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ రాష్ట్ర కన్వీనర్ దామాల సర్వయ్య
- రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్
- మాలలకు జరిగిన అన్యాయాన్ని సరిచేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తాం: మాల మహానాడు

**నల్గొండ,జిల్లా టౌన్ తరంగాలు న్యూస్ ఆగస్టు 8:** నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో మాలల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. గోలి సైదులు, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాధర్నా కార్యక్రమానికి మాల మహానాడు ముఖ్య అతిథిలు గా రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్,రాష్ట్ర కన్వీనర్ దామాల సర్వయ్య హాజరై వారు ప్రసంగించారు.

ఈ సందర్భంగా సుధాకర్ సర్వయ్య మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని, ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం, జీఓ 29 ద్వారా మాలల విద్య, ఉద్యోగ అవకాశాలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపించారు.

### "వర్గీకరణతో మాలల జీవితాలను దెబ్బతీశారు"

ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం చేశారని, రోస్టర్ విధానం ద్వారా మాలల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీశారని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్,దామాల సర్వయ్య విమర్శించారు. మాలలను అణచివేసే విధానాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలకు జరిగిన అన్యాయాన్ని వెంటనే సరిచేయాలి. వర్గీకరణను రద్దు చేయాలి. రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి. జీఓ 29ను తక్షణమే రద్దు చేసి మాల విద్యార్థులు, ఉద్యోగులకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెబుతాం" అని ఆయన హెచ్చరించారు.

### "మాలలకు జరుగుతున్న అన్యాయంపై ఎందుకు మౌనం?"

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఉద్దేశించి దామాల సర్వయ్య మాట్లాడుతూ, మాలలకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందన్నారు. మాలలకు మరియు ఉపకులాలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం లోపల నుంచే గళం వినిపించాలని కోరారు.

మాలల హక్కుల విషయంలో మౌనం వహిస్తే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన విధంగా స్పందిస్తారని ఆయన హెచ్చరించారు.

### జిల్లా జిల్లాలో ఉద్యమాలు -- రాష్ట్రవ్యాప్తంగా సింహగర్జన

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వివిధ జిల్లాల్లో మహాధర్నాలు, నిరసన ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని దామాల సర్వయ్య తెలిపారు.

"ఈ ఉద్యమాలు మాలల ఉనికిని చాటిచెప్పే ఉద్యమాలు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మాలలు మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తారు. మరో భారీ సింహగర్జన నిర్వహించి మాలల ఐక్యతను చాటుతాం" అని ఆయన ప్రకటించారు.

"అన్యాయం సరిచేయకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుంది" పిల్లి సుధాకర్

అనంతరం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ, తెలంగాణలో మాలలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం తక్షణమే సరిచేయాలని డిమాండ్ చేశారు."మాలలకు జరిగిన అన్యాయాన్ని సరిచేయకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రం అగ్నిగుండంగా మారే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు ఓట్లు వేసి అధికారంలోకి తీసుకొచ్చారు. కానీ అదే ప్రభుత్వం మాలల హక్కులను దెబ్బతీస్తే మాలలు మౌనంగా ఉండరు" అని ఆయన స్పష్టం చేశారు.

### మాల మహానాడు డిమాండ్లు

ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి.
రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి.
జీఓ 29ను వెంటనే రద్దు చేయాలి.

వర్గీకరణ, రోస్టర్ విధానం, జీఓ 29 వల్ల ఎస్సీ, ముఖ్యంగా మాల విద్యార్థులు, ఉద్యోగులకు జరిగిన నష్టాన్ని సరిచేయాలి.

మాలలకు విద్య, ఉద్యోగ రంగాల్లో న్యాయమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి.

మాలల హక్కులపై ప్రభుత్వం తక్షణమే చర్చించి పరిష్కారం చూపాలి.

ఈ మహాధర్నాలో మాల మహానాడు రాష్ట్ర, కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ నల్లాల కనకరాజు -- ఐక్య కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులుజనయ్య -- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి అంజయ్య -- రాష్ట్ర కార్యదర్శి రాజారావు -- విశ్రాంత ప్రిన్సిపాల్ రేక శ్రీరాములు -- మాల మహానాడు రాష్ట్ర నాయకులు సంజీవ ఎంవీఎల్ వెంకటరావు ఎం. కాశయ్య -- మాల మహానాడు నాయకులు జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, మాల యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాలల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోంది

- రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయం
- బీజేపీ,బీఆర్ఎస్ దొంగదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి..
- కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**జనగామ ప్రతినిధి, ఆగస్టు 8,తరంగాలు** : దేశంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ భూస్థాపితం కావడం ఖాయమని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ, పట్టణ, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవానికి శనివారం వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ ప్రతి అంశంపై చివరి వరకు పోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఆయనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థుల కోసం పోరాడుతున్న నాయకుడు రాహుల్‌గాంధీ అని అన్నారు. పేపర్ లీకేజీల వంటి సమస్యలపై పోరాటం చేస్తూ ప్రతిపక్షాలను, ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కీలకమైన బిల్లులను మ్యాగీ నూడిల్స్‌లా రెండు మూడు నిమిషాల్లోనే ఆమోదిస్తున్నారని కడియం కావ్య విమర్శించారు. బిల్లులపై ఎంపీల అభిప్రాయాలను, ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ తమ రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించిన బిల్లులను దేశంపైన, దేశ ప్రజలపైన రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. డీలిమిటేషన్ ప్రక్రియను తీసుకురావడం వెనుక బీజేపీ ముందస్తు రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశం ఉందని ఎంపీ ఆరోపించారు. అయితే ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును ఎవరూ ప్రభావితం చేయలేరని అన్నారు. ఎంత పెద్ద పాము అయినా చలిచీమల చేతిలో చనిపోయినట్లే.. ప్రజల చేతిలో బీజేపీ కూలడం ఖాయమని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తున్నాయని ఎంపీ ఆరోపించారు. అందువల్ల ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ జెండాను ఎగురవేయడమే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం ఉంటుందన్నారు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అభిమానంతో వరంగల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు 6,500 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు.

జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ధన్వంతి సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్టీ జిల్లా, పట్టణ, మండల, అనుబంధ సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పార్టీకి ఒక సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సభా ధ్యక్షురాలు – డిసిసి ప్రెసిడెంట్ లకావత్ ధన్వంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, వైటిడిఏ బోర్డు మెంబర్ లక్ష్మీనారాయణ నాయక్, జనగామ మున్సిపల్ చైర్మన్ బాలమణి, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ వినయ్, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, డిసిసి కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ట్రెజరర్, అధికార ప్రతినిధులు, కార్యదర్శిలు, ఎగ్జిక్యూటివ్ ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజారోగ్యంపై డీఎంహెచ్ఓ ఫోకస్




- పైడిపల్లి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్‌లో విస్తృత తనిఖీలు
- వైద్య సేవలపై ఆరా..వ్యాక్సిన్ల నిల్వపై పరిశీలన
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు డ్రై డే, ఫీవర్ సర్వేలు ముమ్మరం చేయాలి
- నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం
- వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 8,తరంగాలు** :ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి ఆదేశించారు. శనివారం పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి సందర్శించి వైద్య సేవలు, రికార్డులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించిన ఆయన ఏఆర్‌వీ, ఏఎస్‌వీ వ్యాక్సిన్ల లభ్యత, నిల్వ విధానం, వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రై డే, ఫీవర్ సర్వేలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడంతో పాటు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పైడిపల్లి సబ్‌సెంటర్‌లో నిర్వహిస్తున్న ఔట్‌రీచ్ ఇమ్యునైజేషన్ సెషన్‌ను డీఎంహెచ్ఓ పరిశీలించారు. వ్యాక్సినేషన్ రికార్డులు, సేవల నిర్వహణను తనిఖీ చేసి అర్హులైన పిల్లలు, గర్భిణీలకు సకాలంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# పేదలపై "వసూళ్ల భారం"ఎందుకు

- ప్రసవానికి వచ్చిన కుటుంబాలకు 'వసూళ్ల' సెగ..?
- ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది తీరుపై ఆరోపణలు
- పేషెంట్ బంధువుల నుంచి డబ్బులు ఎందుకు..?ప్రశ్నించిన ఆర్ఎంఓ..
- ఆర్ఎంఓ ప్రశ్నకు ఆస్పత్రిలో రగిలిన వివాదం!
- స్వీపర్ స్థానచలనం తో కొత్త వివాదం..
- "డబ్బులు ఎందుకు తీసుకోవాలి?" అని రోగుల బంధువుల ప్రశ్న




**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 8, తరంగాలు :** వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చిన మహిళ కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వివాదానికి దారితీశాయి. ఆపరేషన్ థియేటర్‌లో ప్రసవం జరిగిన మహిళ కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు తీసుకోవద్దని ఆర్ఎంఓ మందలించడంతో పాటు, ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత స్వీపర్‌ను స్థానచలనం చేసినట్లు ఆస్పత్రి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ నిర్ణయంపై సదరు స్వీపర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "మా ఇష్టం.. మీకేం సంబంధం? నేను ఇక్కడే పనిచేస్తా.. లేదంటే పని చేయను" అంటూ వ్యాఖ్యానించినట్లు ఆస్పత్రి వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి సమయంలో రోగుల బంధువుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయడం సరికాదని ఆర్ఎంఓ సూచించినట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించే సిబ్బంది రోగులు, వారి బంధువుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారాన్ని ప్రశ్నించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆర్ఎంఓపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో "పేషెంట్ బంధువుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని చెప్పడం ఆర్ఎంఓ చేసిన తప్పా?" అంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వారికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రోగుల బంధువులు పేర్కొంటున్నారు. డబ్బుల వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు నిజమైతే, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# యువత భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ గళమెత్తాలి







- విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా రాహుల్ గాంధీ
- విద్యార్థుల గొంతుక కేంద్రానికి వినబడాలి
- ప్రశ్నించే తత్వమే ఉజ్వల భవిష్యత్తుకు బాట...
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హన్మకొండ ప్రతినిధి , ఆగస్టు 8, తరంగాలు :** విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం, యువత భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి అర్థమయ్యేలా ప్రతి ఒక్క యువత ప్రశ్నించే గొంతుకగా మారాలని,విద్యార్థుల గొంతుక కేంద్రానికి వినబడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గర్జన) కార్యక్రమాన్ని హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మడికొండ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో లైవ్ ద్వారా వీక్షించారు. డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్చార్జి రోష్నీ కుశాల్ జైస్వాల్ హాజరయ్యారు. ఎమ్మెల్యే నాగరాజు విద్యార్థులతో కలిసి రాహుల్ గాంధీ లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను వేధిస్తున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, యువత భవిష్యత్తు వంటి అంశాలపై రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. విద్యార్థులు, యువత ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడం యూత్ కాంగ్రెస్ పోరాట విజయంగా అభివర్ణించారు. విద్యార్థుల సమస్యలపై రాహుల్ గాంధీ నేరుగా గళమెత్తితే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే ఆయనను అక్రమంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. అరెస్టులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని స్పష్టం చేశారు. చిన్న వయసు నుంచే సమస్యలపై ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని నాగరాజు సూచించారు. దేశంలో ఎక్కడ విద్యా వ్యవస్థపై అన్యాయం జరిగినా కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలిచి పోరాడుతుందని అన్నారు. ప్రశ్నించే గొంతుక ఉంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి తక్కళ్లపల్లి సాగరిక, బీజేఎం హనుమకొండ జిల్లా అధ్యక్షులు జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## ఎంతోకాలం యుద్ధంతో తీవ్ర నష్టం

- ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు
- ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సలహా ఇచ్చినట్లు ప్రచారం



వాషింగ్టన్,ఆగస్ట్8 గత ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్కార్యవర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల

ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా, ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు క్యాబినెట్

అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే, సుదీర్ఘకాలంగా వైమానిక దాడులు చేపడుతుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతు న్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. అయితే, వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా.. భారీ సంఖ్యలో ఎ÷-లాంట్లు, ఫ్యాక్టరీలను రక్షణ రంగ కంపెనీలు నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే, క్షిపణుల సంఖ్య గురించి మాత్రం ఆయన కచ్చితమైన లెక్క చెప్పకపోవడం గమనార్హం.

## సిఎన్‌జికి ప్రత్యామ్నాయంగా బయోగ్యాస్

- ద్రేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం
- ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు

న్యూఢిల్లీ,ఆగస్ట్8 దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ. 23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్. ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లుగా, బయో-అఔఉ విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి, దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ÷ంద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.

## మళ్లీ బంగారం ధరల పరుగు



హైదరాబాద్,ఆగస్ట్8 గత కొద్దిరోజుల నుంచి బంగారం ధరలు మళ్లీ వరుసగా పెరుగుతూ పోతున్నాయి. కూడా బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 1090 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 1000 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 820 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,52,350 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,39,650 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,14,260 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 09 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఢిల్లీలో బీజేపీ నేతలతో డా. వన్నాల వెంకటరమణ వరుస భేటీలు





- బీజేపీ అగ్ర నేతలను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర అధికార ప్రతినిధి
- పార్టీ బలోపేతం,ఓబీసీ సంక్షేమం,తెలంగాణ రాజకీయాలపై చర్చలు
- కోవా లక్ష్మణ్,సంజయ్ మయూఖ్,రఘునందన్ రావు,బండి సంజయ్,పాక సత్యనారాయణలకు సత్కారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 8 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ ఢిల్లీలో పలువురు బీజేపీ జాతీయ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులను శాలువాలతో సత్కరించి అభినందనలు



తెలిపారు.రాజ్యసభ సభ్యుడు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా. కోవా లక్ష్మణ్‌ను ఆయన అధికారిక నివాసంలో డా. వన్నాల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా. కోవా లక్ష్మణ్‌ను శాలువాతో సత్కరించారు. దేశ రాజకీయాలు, తెలంగాణలో బీజేపీ పరిస్థితులు, ఓబీసీల సంక్షేమం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం తదితర అంశాలపై ఇరువురు చర్చించినట్లు తెలిపారు.అదేవిధంగా బీహార్ రాష్ట్రం నుంచి మూడుసార్లు ఎమ్మెల్సీగా ఎన్నికైన, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సన్నిహితుడిగా పేరున్న సీనియర్ బీజేపీ నాయకుడు సంజయ్ మయూఖ్‌ను జాతీయ బీజేపీ కార్యాలయంలో డా. వన్నాల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు.

### రఘునందన్ రావు, బండి సంజయ్ కి సత్కారం

మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు తో పాటు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ని వారి అధికారిక నివాసంలో డా. వన్నాల వెంకటరమణ, ఆయన తండ్రి, మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు, బండి సంజయ్ ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వన్నాల వెంకటరమణ మేనమామ, పటాన్‌చెరుకు చెందిన పారిశ్రామికవేత్త వేముల సాంబయ్య పాల్గొన్నారు.

### పాక సత్యనారాయణకు అభినందనలు

దీర్ఘకాలంగా ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ, బీజేపీలో వివిధ స్థాయిల్లో సేవలందించిన సీనియర్ జాతీయ బీజేపీ నాయకుడు, 2025లో ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పాక సత్యనారాయణను కూడా డా. వన్నాల వెంకటరమణ ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాక సత్యనారాయణను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ భేటీలో మాజీ శాసనసభ్యుడు కొండేటి శ్రీధర్, యువ నాయకుడు ఆదిత్య సాయి పాల్గొన్నారు.



### పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా చర్చించినట్లు డా. వన్నాల వెంకటరమణ తెలిపారు. సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంతో తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో జరిగిన ఈ వరుస భేటీలు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి.



# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

## కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.


# వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్

శ్రీలంకతో రెండు టెస్టల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో పాటు, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడి రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీకి చేరువైన కేఎల్ రాహుల్(40)ను నువాంత క్లీన్ బౌల్డ్ చేశాడు.రవీంద్ర జడేజా సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ మరుసటి బంతికే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి రిషభ్ పంత్ వచ్చాడు. కానీ అతను ఐదు బంతుల్లో 2 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ కూడా ఆ కాసేపటికే క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఇద్దరినీ స్పిన్నర్ రమేష్ మెండీస్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో జడేజా, మానవ్ సుతార్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ అనంతరం రవీంద్ర జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. కుల్దీప్ యాదవ్(1) గాయంతో తప్పుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(1) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సరాన్ష్ జైన్(22) పరుగుల తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. దేవదత్ పడిక్కల్ తిరిగిన బ్యాటింగ్‌కు వచ్చాడు. గుర్నూర్ బ్రార్‌తో కలిసి అతను రెండో రోజు ఆటను ముగించాడు...





# లియోనల్ మెస్సీ హత్యకు కుట్ర..




ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ 2026 సందర్భంగా అర్జెంటీనా స్టార్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హ్యతకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఈ అర్జెంటీనా దిగ్గజాన్ని లక్ష్యంగా చేసుకొని టెర్రర్ అటాక్ ప్లాన్ చేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. లియోనెల్ మెస్సీని హత్య చేయాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని స్పానిష్ న్యూస్ పేపర్ కథనం ప్రచురించింది. ఇందుకు సంబంధించిన పక్కా సమాచారం అమెరికా పోలీసుల వద్ద ఉందని పేర్కొంది. అయితే ఈ ప్రయత్నాలను అమెరికా ఎఫ్‌బీఐ, అంతర్జాతీయ పోలీస్ సహకార విభాగం నేతృత్వంలోని సెక్యూరిటీ నెట్‌వర్క్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాయని ఆ కథనంలో తెలిపింది. ఆత్మహుతి దాడితో మెస్సిని చంపాలని ఉగ్రమూకలు ప్రయత్నించాయని వెల్లడించింది. మెస్సి హ్యతకు సంబంధించి ఓ దుండగుడు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టినట్లు కూడా ఆ కథనంలో పేర్కొన్నారు. 'నా శరీరానికి నాలుగు బాంబులు పెట్టుకొని మెస్సీని పేల్చేసేందుకు అట్లాంటా స్టేడియానికి వెళు_తున్నా'అని నిందితుడు పోస్ట్ పెట్టి తొలిగించినట్లు సమచారం. ఈ పోస్ట్‌తో అప్రమత్తమైన భద్రతా అధికారులు ఉన్నత స్థాయిలో సమీక్షించి కఠిన చర్యలు తీసుకున్నట్లు స్పానిష్ పత్రిక వెల్లడించింది. డాలస్ ఎయిర్ పోర్ట్‌కు వచ్చిన ఓ ఫోన్ కాల్‌ను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇంట్లో తయారు చేసిన బాంబులతోపాటు ఏఆర్-15 తుపాకీతో స్టేడియానికి వెళ్తున్నట్లు ఆ అనుమానితుడు పేర్కొన్నాడని ఆ కథనంలో రాసుకొచ్చారు. మెస్సితో పాటు ఇతర క్రీడాకారులు, పోలీస్ అధికారులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని భద్రతా సిబ్బంది గుర్తించారు. లియోనెల్ మెస్సీతో పాటు క్రిస్టియానో రొనాల్డో కూడా వారి జాబితాలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. పోర్చుగల్ ఫుట్‌బాల్ టీమ్ బస ఎక్కడని ఆరా తీసినట్లు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. దాంతో అప్పటి నుంచి భద్రతపరంగా అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఫిఫా ప్రపంచకప్ ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ విజేతగా నిలవగా.. అర్జెంటీనా రన్నరప్‌తో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే.



## ఆశిష్ యాదవ్‌కు రజతం

యుజీన్ (యుఎస్‌ఏ) : వరల్డ్ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. పురుషుల జావెలిన్ త్రోలో ఆశిష్ యాదవ్ రజతం సాధించాడు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధ రాత్రి జరిగిన ఫైనల్లో 19 ఏండ్ల అశిష్ మూడో ప్రయత్నంలో ఈటెను 74.09 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. దాంతో డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా తర్వాత ఈ టోర్నీ జావెలిన్ త్రో ఈవెంట్‌లో పతకం నెగ్గిన భారత రెండో అథ్లెట్‌గా ఆశిష్ రికార్డు సృష్టించాడు.2016లో నీరజ్ చోప్రా 86.48 మీటర్లతో ప్రపంచ జూనియర్ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. కాగా, మహిళల హైజంప్‌లో పూజ సింగ్ 1.79 మీటర్ల ఎత్తు నుంచి దూకి ఫైనల్‌కు అర్హత సాధించింది. పురుషుల లాంగ్ జంప్‌లో షానవాజ్ ఖాన్, జిథిన్ అర్జు న్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకున్నారు.




## టీమిండియాకు గాయాల బెడద



శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో ఈ పర్యటనకు దూరం కాగా.. జాగా ఈ జాబితాలో సాయి సుదర్శన్ చేరాడు. కాలి బొటన వేలి గాయంతో ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్-ఏ తరఫున శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లో సాయి సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. అయినా శ్రీలకంతో రెండు టెస్టల సిరీస్‌కు సాయి సుదర్శన్‌ను ఎంపిక చేసిన సెలెక్టర్లు.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సిరీస్‌లో కొనసాగుతాడని తెలిపారు. అయితే తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో సాయి సుదర్శన్ గాయం తగ్గలేదని తేలింది. దాంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కావాల్సి వచ్చింది. అయితే సాయి సుదర్శన్ దూరమవ్వడంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ సమయంలోనే అతనికి రిప్లేస్‌మెంట్‌గా మరో ఆటగాడిని ఎంపిక చేయవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో తెలుగు తేజం షేక్ రషీద్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డ్ ఉంది. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్‌గా అతని రికార్డ్స్ మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటి వరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షేక్ రషీద్ 46.64 సగటుతో 1959 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలతో పాటు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లోనూ షేక్ రషీద్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 63, 20, 45 పరుగులతో రాణించాడు. అయితే షేక్ రషీద్‌కు సర్ఫరాజ్ ఖాన్‌తో పోటీ నెలకొంది. అయితే ఐపీఎల్ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడలేదు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం లభిస్తుంది. సెలెక్టర్లు సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్ పేర్లను సాయి సుదర్శన్‌కు రిప్లేస్‌మెంట్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రుతురాజ్ గైక్వాడ్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ట్రావిస్ హెడ్‌కు అలన్ బోర్డర్ మెడల్

**వరుసగా రెండో ఏడాది హెడ్ కైవసం**



ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డ్ వరించింది. ఆస్ట్రేలియా అత్యున్నత పరుస్కారమైన అలన్ బోర్డర్ మెడల్‌ను వరుసగా రెండో ఏడాది కూడా ట్రావిస్ హెడ్ కైవసం చేసుకున్నాడు. బ్రిస్బేన్ వేదికగా జరిగిన క్రికెట్ ఆస్ట్రేలియా అవార్డుల కార్యక్రమంలో దిగ్గజ కెప్టెన్ అలన్ బోర్డర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఈ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అందుకున్నాడు. దాంతో వరుసగా రెండో ఏడాది అలెన్ బోర్డర్ మెడల్ అందుకున్న ఐదో ఆసీస్ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాళ్లు అయిన రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ సరసన చేరాడు.ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం జరిగిన ఓటింగ్‌లో ట్రావిస్ హెడ్ కేవలం ఒక్క ఓటు తేడాతో గెలుపొందడం గమనార్హం. తన సహచర ఆటగాడు, ఆస్ట్రేలియా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 152 ఓట్లతో రెండో స్థానంలో నిలిచి తృటిలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును కోల్పోయాడు. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ 150 ఓట్లతో మూడో స్థానంలో నిలిచాడు. 2025 జనవరి 29 నుంచి 2026 జనవరి 8 వరకు ఉన్న ఓటింగ్ వ్యవధిలో ట్రావిస్ హెడ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు.గతేడాది ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలో 30 మ్యాచ్‌లు ఆడిన ట్రావిస్ హెడ్.. 1,437 పరుగులు సాధించి ఆసీస్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో మూడు సెంచరీలతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇదే కార్యక్రమంలో షేన్ వాట్సన్ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ స్టార్క్, వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ మార్ష్, టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా టిమ్ డేవిడ్ అవార్డులు అందుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన ట్రావిస్ హెడ్.. అలన్ బోర్డర్ సమక్షంలో వరుసగా రెండోసారి ఈ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పాడు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. అప్‌కమింగ్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్‌లపైనే తన పూర్తి దృష్టి ఉందని స్పష్టం చేశాడు.